విద్యార్థుల్లో అద్భుత సృజనాత్మకత

- నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ
- రెండో రోజూ కొనసాగిన నారీ ఫెస్ట్ ఉత్సవాలు

రాజానగరం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులలో అద్భుతమైన సృజనాత్మకత దాగి ఉందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని యూనివర్సిటీలో వుమెన్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నారీ ఫెస్ట్ 2025 ఉత్సవాలు రెండో రోజు బుధవారం ఉత్సాహంగా కొనసాగాయి. యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న గోదావరి జిల్లాలోని కళాశాలల సిబ్బందికి సృజనాత్మకతతో కూడిన వస్తువుల తయారీ (చేతి పనులు, చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీ, పూల అలంకరణ)పై వివిధ రకాల పోటీలు నిర్వహించారు. వీటిలో చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలతో ఏర్పాటు చేసిన స్టాళ్లు సందర్శకుల నోటికి వివిధ రకాల రుచులను అందించాయి. అలాగే సమీపంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు చిత్రలేఖనంలో పోటీలు జరిగాయి. ఆ పోటీలను సందర్శించిన వీసీ ఆ విద్యార్థినుల ప్రతిభను ప్రశంసించారు. మీకు ఆసక్తి ఉన్న అంశం గురించి ముందుగా మీ తల్లిదండ్రులకు తెలియజేయాలని, వారి సహకారం తీసుకుని, గురువుల తోడ్పాటుతో నైపుణ్యాలను వృద్ధి చేసుకునేందుకు ప్రయత్నించాలన్నారు.


చిత్రలేఖనం పోటీలను పరిశీలిస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ


అలంకరణ పోటీలలో అనుబంధ కళాశాలల సిబ్బంది

ఆత్మ రక్షణ విద్య అవసరం

ప్రస్తుత సమాజంలో ప్రతి మహిళ ఆత్మ రక్షణ చర్యలలో భాగంగా మార్షల్ ఆర్ట్స్‌లో అవసరమైన శిక్షణను పొందాలని వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ అన్నారు. యూనివర్సిటీలోని కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన మార్షల్ ఆర్ట్స్ పోటీలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదాల నుంచి తప్పించుకునే నేర్పు అవసరమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, వుమెన్ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.ఉమా మహేశ్వరీదేవి, చీఫ్ పెట్రన్ డాక్టర్ ఎస్.సుజనా రాజ్, ట్రెజరర్ డాక్టర్ బి.విజయ కుమారి, డాక్టర్ కె.రమణేశ్వరి, డాక్టర్ కె.సుబ్బారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వినాయకుడికి పూజలు


ప్రత్యేక అలంకరణలో వినాయకుడు

పెదపూడి: సంపర గ్రామంలో పంట కాలువ సమీపంలో ఉన్న సిద్ధి వినాయకునికి బుధవారం గరికిపూజ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నరసన్న హుండీల ఆదాయం రూ.3.97 లక్షలు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

మధురపూడి: కోరుకొండలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో బుధ వారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. కొండపైన, కింద ఏర్పాటు చేసిన హుండీల నుంచి రూ.3,97,290 వచ్చింది. అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానం అధికారుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. త్వరలో జరగనున్న స్వామి వారి ఉత్సవాలలో తలనీలాలు, కొబ్బరి ముక్కలను పోగు చేసుకోవడం, చెప్పుల స్టాండ్ నిర్వహణకు బహిరంగవేలం నిర్వహించారు. దీని ద్వారా ఆలయానికి రూ.1,84,500 ఆదాయం వచ్చింది. వీటిలో కొబ్బరికాయల ముక్కలను పోగు చేసుకునేందుకు రూ.1.30 లక్షలు, చెప్పుల స్టాండ్ నిర్వహణకు రూ.48,500, తలనీలాలకు రూ.6 వేలుకు పాడుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ రంగరాజబట్టర్, అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.సుబ్బారావు, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు, సహాయ కార్యనిర్వహణాధికారి పి.జగ్గారావు పాల్గొన్నారు.

15 లోగా పన్నులు వసూలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామ పంచాయతీల్లో ఈ నెల 15 లోగా పన్నుల వసూలు పూర్తి చేయాలని ఈఓపీఆర్డీ మేడపాటి సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయం కార్యదర్శులకు బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులు మొత్తం వసూలు చేసి గ్రామ పంచాయతీకి జమ చేయాలన్నారు. పన్నేతరాలను బ్యాంకుకు కట్టాలన్నారు. ఎండలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలన్నారు. దోమల నివారణకు మందును పిచికారీ చేయించాలన్నారు.

ఆబోతును చంపేశారని ఫిర్యాదు

కడియం: వీరవరం గ్రామంలో సంచరించే ఆబోతును కొందరు యువకులు చంపేసి, పొట్టిలంక సమీపంలోని శ్మశానవాటికలో పూడ్చిపెట్టారంటూ పలువురు హిందూ సంఘాల ప్రతినిధులు బుధవారం కడియం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉద్దేశపూర్వకంగా ఈ చర్యకు పాల్పడిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

కంటైనర్‌లో ఎద్దుల అక్రమ రవాణా

- అడ్డుకున్న సాధువులు
- వాహనాన్ని సీజ్ చేసిన పోలీసులు

రాజానగరం: కంటైనర్‌లో అక్రమంగా జరుగుతున్న ఎద్దుల తరలింపును అడ్డుకోవడంతో పాటు సంబంధిత యజమానిపై కేసు నమోదు చేశామని నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ తెలిపారు. జాతీయ రహదారిపై సూర్యారావుపేట జంక్షన్‌లో బుధవారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. శ్రీకాకుళం జిల్లా పానవరం నుంచి చిలకూరిపేట సంతకు కంటైనర్‌లో 52 ఎద్దులను తరలిస్తున్నారు. అదే సమయంలో రాజమహేంద్రవరం వైపు పాదయాత్రగా వెళుతున్న కొందరు సాధువులు ఆ విషయం తెలుసుకుని, పై జంక్షన్‌లో ఆ వాహనాన్ని ఆపే ప్రయత్నం చేశారు. కానీ కంటైనర్ డ్రైవర్ వారిని ఢీకొట్టి ముందుకు పోయేందుకు యత్నించాడు. దీనితో ఆ వాహనంపై సాధువులు రాళ్లు విసరసాగారు. దీనితో ఎట్టకేలకు ఆ వాహనాన్ని నిలువరించగలిగారు. విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న పోలీసులు కంటైనర్‌ని ఓపెన్ చేసి చూస్తే 52 ఎద్దులు ఇష్టానుసారంగా కూరేసి ఉన్నాయి. కంటైనర్‌ను పోలీసు స్టేషనుకు తరలించి, అందులో ఉన్న ఎద్దులను సీతానగరం మండలం బొబ్బిల్లంకలో ఉన్న రీహేబిటేషన్ సెంటర్‌కి తరలించారు. వాహన డ్రైవర్ పరారు కావడంతో యజమానికి ఫోన్ చేసి, రప్పిస్తున్నారు. ఆర్డీఓ ఆదేశాలను అనుసరించి ఆ వాహనాన్ని సీజ్ చేశారు.

సీఐ తీరును నిరసిస్తూ ర్యాలీ

గోవుల అక్రమ రవాణాకు సీఐ పూర్తి సహకారం అందిస్తున్నారని హిందూ గోసేవా సమితి సభ్యులు ఆరోపిస్తూ బుధవారం మధ్యాహ్నం రాజానగరంలో ర్యాలీ నిర్వహించారు. మహాశివరాత్రి రోజున గామన్ బ్రిడ్జి పై ఇదే విధంగా అక్రమంగా తరలిస్తున్న ఆవులను పట్టుకుని పోలీసులకు అప్పగించామన్నారు. ఆ తరువాత వాటి సంగతిగానీ, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తుల గురించి గానీ ఏవిధమైన సమాచారం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.


కంటైనర్‌లో అక్రమంగా తరలిస్తున్న ఎద్దులు


సీఐకి వ్యతిరేకంగా రాజానగరంలో ర్యాలీ చేస్తున్న సాధువులు


కేసు వివరాలను తెలియజేస్తున్న డీఎస్పీ శ్రీకాంత్

మహిళలకు వైద్య పరీక్షలు


మహిళకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

పెదపూడి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కరకుదురు గ్రామంలోని రామాలయం వద్ద బుధవారం మహిళలకు వైద్య శిబిరం నిర్వహించారు. ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్, మేడ్వే సంజీవి హాస్పిటల్ కాకినాడ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాన్ని జనసేన మండల మహిళ నాయకురాలు పాటంశెట్టి కాశీరాణి నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు జుత్తక సూర్యకుమారి, జుత్తక సూర్యకుమారి, పెండెం శ్రీదేవి, నూకల భానుమతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శిబిరంలో 162 మంది మహిళలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలన


చినకొండేపూడిలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ మూర్తి

సీతానగరం: చినకొండేపూడిలోని చెత్త నుంచి సంపద కేంద్రాన్ని ఈవోపీఆర్డీ కేవీఎస్ఎస్ మూర్తి బుధవారం పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి వర్మీ కంపోస్టు తయారు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. అనంతరం విలేకరుతో మాట్లాడుతూ గ్రామాల్లో పొడి, తడి చెత్తపై అవగాహన కల్పించామన్నారు. మండలంలోని 21 పంచాయతీల్లో జాలిమూడి, రఘుదేవపురం, చీపురపల్లి, వెదుళ్లపల్లిలో చెత్త నుంచి సంపద కేంద్రాలకు షెడ్లు లేవన్నారు. మిగిలిన 17 పంచాయతీల్లోని చెత్త నుంచి సంపద కేంద్రాల్లో వర్మీ కంపోస్టు తయారు చేయడం జరుగుతుందన్నారు.

ఆధ్యాత్మికవేత్త కృష్ణమాచార్యులు మృతి



మధురపూడి: విష్ణుసహస్రనామ పారాయణ, తురుప్పావైపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆధ్యాత్మిక సేవలందించిన ఇరగవరపు కృష్ణమాచార్యులు బుధవారం మృతి చెందారు. గుండె సంబంధిత అనారోగ్య సమస్యతో ఆయన హాస్పిటల్లో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతికి ఆర్యవైశ్యసంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు సంతాపం తెలిపారు.

మద్యం షాపులకు 36 దరఖాస్తులు

రంగంపేట: గీత కార్మిక కులాలకు చెందిన వారికి ప్రభుత్వం కేటాయించిన మద్యం షాపుల కోసం 36 దరఖాస్తులు అందినట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ స్టేషన్ సీఐ సుధ తెలిపారు. ఆమె బుధవారం మాట్లాడుతూ తమ పరిధిలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల్లో మొత్తం మూడు షాపుల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానించామన్నారు. వీటికి సంబంధించిన డ్రా గురువారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తారన్నారు. దరఖాస్తులందరూ తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

మంచి ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న దాతలు

రంగంపేట: దాతల ప్రోత్సాహంతో మంచి ఉత్తీర్ణత సాధించడానికి విద్యార్థులు కృషి చేయాలని పాఠశాల యాజమాన్య కమిటీ కో ఆప్షన్ సభ్యుడు, పూర్వపు విద్యార్థులు ఉండవల్లి వెంకట్రావు, పేపకాయల సూర్యారావు అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆల్పాహారం అందించారు. ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 17 మంది గైర్హాజరు

రంగంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో బుధవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీషు పరీక్ష జరిగింది. ఇక్కడ రంగంపేట, రాజానగరం మండలాలకు చెందిన 472 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 17 మంది రాలేదని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటిండెంట్లు బి.హేమ, ఎస్.మాధురి తెలిపారు. డిపార్టుమెంటల్ అధికారులుగా ఏపీఆర్‌వీ ప్రసాద్, ఎంవీఎస్ కృష్ణ వ్యవహరించారు.

దాతల సహకారం అభినందనీయం


కమిటీ ప్రతినిధులకు విరాళం అందజేస్తున్న లక్ష్మి

పెదపూడి: గ్రామంలోని హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అరుమిల్లి అమ్మన్న చౌదరి అన్నారు. పెదపూడిలో బుధవారం దివంగత పోలుగుపల్లి శ్రీహరి, దివంగత వెంకట్రాజు చౌదరి జ్ఞాపకార్థం శ్రీహరి భార్య లక్ష్మి రూ.లక్ష విరాళాన్ని నిర్మాణ అభివృద్ధి కమిటీ ప్రతినిధులకు అందజేశారు. అలాగే గ్రామంలోని వేట్లపాలెం వీధి కొలగారం నగదు రూ.1.60 లక్షలు, కంటిపూడి వీర్రాఘవులు కుమారుడు దివంగత గౌతమ్ జ్ఞాపకార్థం రూ.50 వేలు అందించారు. అమ్మన్న చౌదరి మాట్లాడుతూ దాతలు గ్రామాభివృద్ధికి సహకరించాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో నిర్మాణ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు మార్ని అన్నవరం, మార్ని కాశీ, అరుమిల్లి వాసు, అబ్బిన సూరిబాబు, అరుమిల్లి బుజ్జి, అరుమిల్లి వీరన్న పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రాజానగరం: సమష్టిగా పయనిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని ఏపీఈడబ్ల్యూఎస్‌ఈఈఏ 391 అసోసియేషన్ పిలుపునిచ్చింది. మండలంలోని చక్రద్వారబంధంలో నిడదవోలు, రాజమహేంద్రవరం డివిజన్ల పరిధిలోని జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం) -2లు బుధవారం సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఆర్‌వీఎస్ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా మురళీకృష్ణ, సెక్రటరీగా ఐ. తాతాజీ, కోశాధికారిగా ఇందేశ్, జాయింట్ సెక్రటరీగా చంటిబాబు ఎంపికయ్యారు.

గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ ఇవ్వాలి

రాజానగరం: రాష్ట్రంలో చేపట్టబోయే ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియలో భాగంగా జీఓ నంబర్ 3 ప్రకారం గిరిజనుల కోసం ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని అఖిల భారత జిల్లా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ వరహాలదొర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ ప్రత్యేక డీఎస్సీ ఇస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీని గుర్తు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన


ఆరు నెలల పాపకు అన్నప్రాసన చేస్తున్న దృశ్యం

సీతానగరం: ముగ్గళ్ల గ్రామంలోని ఒకటో నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అన్నప్రాసన నిర్వహించారు. ఆ కేంద్రం వర్కర్ పి.సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో నాగులపల్లి వరలక్ష్మి కుమార్తె అయిన ఆరు నెలల పాపకు అన్నప్రాసన చేశారు. ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) డే సందర్భంగా ఈ కార్యక్రమం జరిపారు. అలాగే గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. టేక్ హోమ్ రేషన్ (టీహెచ్ఆర్)లో బాలామృతం, పాలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎం.వరలక్ష్మి, ఏఎస్ఎం షేక్ సహిదా బేగం, ఆశావర్కర్లు మాధవి, మరియమ్మ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అలసత్వం వద్దు

బిక్కవోలు: పారిశుధ్య పనుల్లో అలసత్వం వద్దని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. ఆర్థిక సంవత్సరం పూర్తి కావొస్తున్నందున పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సర్వే, వర్క్ ఫ్రం హోం సర్వే, చైల్డ్ ఆధార్ సర్వే సమగ్రంగా చేపట్టాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ఏలేటి అన్వేష్ (ఫైల్)

రాజానగరం: జాతీయ రహదారిపై ఆదికవి నన్నయ యూనివర్సిటీ సమీపంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకృష్ణపట్నానికి చెందిన ఏలేటి అన్వేష్ (25) బైకుపై రాజానగరం వెళ్లి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అన్వేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. నాయీ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన అన్వేష్ బార్బర్ వృత్తిలో తండ్రి దుర్గారావుకు ఆసరాగా ఉండేవాడు. అతడు బుధవారం మధ్యాహ్నం షాపులో ఉండగా రాజానగరం నుంచి మిత్రుడు ఫోన్ చేస్తే బయటకు వచ్చాడు. ఈ ఘటనపై రాజానగరం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ స్టేషన్‌కు బారికేడ్లు అందజేత

రంగంపేట: స్థానిక పోలీసు స్టేషన్‌కు బీఎస్ఆర్ సంస్థ బారికేడ్లను బహూకరించిందని ఎస్సై తోట కృష్ణసాయి తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ రాజానగరం - సామర్లకోట మధ్య ఏడీబీ రోడ్డు విస్తరణ, అభివృద్ధిలో భాగంగా జరుగుతున్న పనుల కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. వీటి నివారణకు బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ సంస్థ నాలుగు బారికేడ్లు తయారు చేయించి పోలీస్ స్టేషన్‌కు అందించిందన్నారు.

జీజీయూలో వర్క్‌షాప్

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో 'పరిశోధన, ఆవిష్కరణ, అవకాశాల అన్వేషణ'అనే అంశంపై బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. సీఏఓ డాక్టర్ కె. విజయ భాస్కరరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్టేక్ హోల్డర్స్ ఎంగేజ్మెంట్ అడ్వైజర్ శిశిర్ సాహు కీలక ఉపన్యాసమిచ్చారు. డైరెక్టర్లు డాక్టర్ ఎం. శ్రీనివాసరావు, డాక్టర్ టీవీ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జయానందకుమార్ పాల్గొన్నారు.